అస్తవ్యస్తంగా మ్యాన్‌హోళ్లు

- రహదారుల్లో ప్రమాదభరితంగా తయారైన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని యూజీడీ అధికారులు



ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ రోడ్డులో మ్యాన్‌హోల్

మద్దిలపాలెం: జీవీఎంసీ 23, 16 వార్డుల్లోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రహదారుల్లో ఎక్కడికక్కడ అస్తవ్యస్తంగా నిర్మించిన మ్యాన్‌హోళ్లు ప్రమాదభరితంగా మారాయి. ఇంజినీరింగ్ విభాగం అధికారులు కొన్ని చోట్ల అధ్వానంగా చేపట్టిన యూజీడీ పనులు అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. ముందస్తు ప్రణాళిక, భవిష్యత్తులో రాబోయే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు నిర్వహించకపోవడంతో స్థానిక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

రాత్రి వేళల్లో ప్రమాదాలు

మద్దిలపాలెం శివాలయం నుంచి సీఎంఆర్ శ్మశానవాటిక వైపుగల రోడ్డులో ప్రతి మ్యాన్‌హోల్ చుట్టూ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇక్కడి మ్యాన్‌హోళ్లు అడుగు లోతు భూమిలోకి కూరుకుపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇలా ఒక్కో కాలనీలో పదుల సంఖ్యలో మ్యాన్‌హోల్ గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండటంతో ప్రయాణాలు సాగించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కొన్నిచోట్ల వీధిలైట్లు సరిగ్గా వెలగక మ్యాన్‌హోల్ గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

రహదారుల్లో గోతుల్లా..

ఈ వార్డుల్లో కొన్ని చోట్ల నిర్మించిన యూజీడీ మ్యాన్‌హోళ్లు గోతులను తలపిస్తున్నాయి. డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల రహదారి నుంచి మద్దిలపాలెం శివాలయం వైపు వెళ్లే రోడ్డులోని మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రోడ్డు మధ్యలో పెద్ద గోతుల మాదిరిగా మ్యాన్‌హోళ్లు ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు మండిపడుతున్నారు.



అంబేడ్కర్ కాలనీలో కాలువను తలపిస్తున్న యూజీడీ మ్యాన్‌హోల్



కేఆర్‌ఎం కాలనీలో మ్యాన్‌హోల్ వద్ద గోతులు



కేఆర్‌ఎం కాలనీ రోడ్డులో ప్రమాదభరితంగా యూజీడీ మ్యాన్‌హోల్

లీకవుతున్నా.. పట్టించుకునే వారేరి?

మద్దిలపాలెం శివాలయం రోడ్డులో ఒక చోట మ్యాన్‌హోల్ లీకవుతూనే ఉంది. ఈ సమస్యను యూజీడీ ఇంజినీర్లు పట్టించుకోకపోవడంతో మురుగు నీరు గోతిలో నుంచి బయట రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో దుర్వాసన మధ్య రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యూజీడీ ఇంజినీర్ల నిర్లక్ష్యం!

జీవీఎంసీ యూజీడీ విభాగం ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. యూడీజీ మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా నిర్మించాల్సి ఉందని, అలా కాకుండా ఒక చోట రోడ్డుకు ఎత్తుగాను, మరో చోట రోడ్డు కిందగా గోతుల్లో నిర్మించారని విమర్శిస్తున్నారు. ఇలా అస్తవ్యస్తంగా నిర్మించిన మ్యాన్‌హోళ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీల వాసులు, వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుకు సమాంతరంగా మ్యాన్‌హోళ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'ఎంవీపీ బజార్'కు స్వచ్ఛ రైతుబజార్ అవార్డు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్ రాష్ట్ర స్థాయి స్వచ్ఛ రైతుబజార్ అవార్డుకు ఎంపికైంది. స్వచ్ఛ ఆంధ్రా అవార్డుల్లో భాగంగా స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ రైతుబజార్లు తదితర వాటిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేశారు. ఎంపికైన వాటి ప్రతినిధులకు ఈ నెల 6న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవార్డులు అందజేయనున్నారు. ఎంవీపీ రైతుబజార్ రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ రైతుబజార్‌గా ఎంపికైనట్లు ఈవో వరహాలు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విశాఖ జిల్లాకు లభించిన ఏడు అవార్డుల్లో ఎంవీపీ రైతుబజార్ ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

22వ వార్డులో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు బలరాంనగర్‌లో దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. యువత ఆధ్యాత్మిక భావంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్ల నియామకం



గొలగాని హరివెంకటకుమారి



గుడిమెట్ల రవికుమార్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి ఇద్దరిని ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్‌ఈసీ) మెంబర్లుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా గొలగాని హరివెంకటకుమారి, గుడిమెట్ల రవికుమార్‌లను నియమించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ సబ్ స్టేషన్ నుంచి పైనాపిల్ కాలనీ సబ్ స్టేషన్ వరకు 33 కేవీ యూజీ కేబుల్ చార్జింగ్ కోసం క్లియర్స్ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆరిలోవలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వ్యక్తిపై దాడి కేసులో ఐదుగురికి రిమాండ్

ఆరిలోవ: స్థానిక రవీంద్రనగర్‌లో ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సిహెచ్.రాందాస్ తెలిపిన వివరాలిలా.. ఆదర్శనగర్‌కు చెందిన దొడ్డి భానుకిరణ్‌పై పాత కక్షల కారణంగా రవీంద్రనగర్ బస్టాప్ వద్ద శ్రీను, జోసెఫ్, కనకరాజు, కిరణ్, సంపత్‌లు సోమవారం రాత్రి బీరు బాటిళ్లతో దాడి చేసి గాయపరిచారు. దీంతో భానుకిరణ్ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాందాస్ కేసు నమోదు చేసి సీఐ హెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

జూలో సందడిగా వన్యప్రాణి వారోత్సవాలు



చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న చిన్నారులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో గురువారం వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా, మొదటి రోజు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'తేనెటీగలు, పక్షులు, సీతాకోక చిలుకలు, సముద్ర జీవ వైవిధ్యం – మనం' –'మానవ – ఏనుగు సంఘర్షణ' వంటి అంశాలపై ఈ పోటీలు జరిగాయి. వన్యప్రాణులపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఈ సందర్భంగా తెలిపారు.

వేడుకగా అఖండ భగవన్నామ సంకీర్తన



మాట్లాడుతున్న సమితి చైర్మన్ వెంకట్రావు

డాబాగార్డెన్స్: విజయదశమిని పురస్కరించుకుని రామ్‌నగర్ రాఘవేంద్రస్వామి మఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో దసరా సంగీత మహోత్సవం పేరిట గురువారం 12 గంటల పాటు నిర్వహించిన అఖండ భగవన్నామ సంకీర్తన ఆధ్యాత్మిక చైతన్యం నింపింది. సమితి చైర్మన్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమితి శిష్యులు, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమేశ్వరుడు, అమ్మవార్లకు, సుబ్రహ్మణ్యునిపైన, గోవింద నామ సంకీర్తనలు సామూహికంగా గానం చేసి హనుమాన్ చాలీసాతో ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సమితి ప్రతినిధులు కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్మోహనరావు, జి.మధుబాబు, మధుసూదనరావు, నాగేశ్వరరావు, సమితి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ఇసుకతోటలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మొల్లి అప్పారావు, మొల్లి లక్ష్మి

మద్దిలపాలెం: విజయ దశమి సందర్భంగా నియోజకవర్గంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలను వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మొల్లి లక్ష్మిలు సందర్శించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 16వ వార్డు ఇసుకతోట శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు, ఇసుకతోట శివగణపతి యూత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో విజయం సాధించి, ప్రజలకు గొప్ప సేవలు అందించాలని అర్చకులు ఆశీర్వదించారు. సంఘ అధ్యక్షులు ఒమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి ఒమ్మి నాయుడు, మాజీ అధ్యక్షులు గొలగాని అప్పారావు, పల్లా త్రినాథ్, ఈగల సత్యం, డొక్కర అప్పారావు, ఉప్పిలి కృష్ణం నాయుడు, ముద్వల గోవింద్, మీసాల ప్రదీప్, సంధ్య, పార్వతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం



వాహనాల నుంచి ఎగిసి పడుతున్న మంటలు



దగ్ధమైన ద్విచక్ర వాహనాలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి శివాలయం సమీప కొండవాలు వీధిలో ఇంటి ముందు నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలు గురువారం వేకువజామున దగ్ధమయ్యాయి. వాటి నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వేకువజాము స్థానికులు నిద్రలో ఉన్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఎగిసిపడుతున్న మంటల్లో వాహనాల నుంచి వచ్చిన పెద్ద శబ్దాలకు స్థానికులు మేల్కొని మంటలను గమనించి అదుపు చేయడానికి ప్రయత్నించారు. అప్పటికే ఆ రెండు వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. వాహనాల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందా.. లేదంటే ఆకతాయిలు ఎవరైనా వాటికి నిప్పంటించారా అనే కోణంలో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై వాహన యజమానులు మణికుమార్, ప్రసాద్ శుక్రవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలు సోదర భావంతో మెలగాలి



కేంద్ర కారాగారంలో ఖైదీకి బహుమతి అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ: కారాగారంలోని ఖైదీలంతా సోదర భావంతో కలిసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు అన్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో గురువారం గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీ జయంతినే ఖైదీల సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు ఖైదీలకు పలు పోటీలు నిర్వహించారు. ఖైదీలు వివిధ వేషధారణలో ప్రదర్శించిన నాటికలతో అతిథులను అలరించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను అనుసరించి మెలగాలని ఖైదీలకు సూచించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ శాంతియుత సమాజం దిశగా అందరూ నడుచుకోవాలన్నారు. కారాగారం శిక్షణాలయమని, ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లిన తర్వాత ఉన్నతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో జైల్ పర్యవేక్షణాధికారి ఎస్.సాయిప్రవీణ్, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దేదీప్యమానంగా దీపారాధన



చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



భక్తులు వెలిగించిన దీపాలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలిలోని నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో దసరా సందర్భంగా దీపారాధన ఘనంగా జరిగింది. సాయినాథుడి ఆవరణలో తొమ్మిది వేల దీపాలు వెలిగించి భక్తులు తరించారు. ఇక్కడ గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కొబ్బరి నూనెతో నిండిన ప్రమిదల్లో భక్తులు దీపాలు వెలిగించారు. దీంతో ఆలయమంతా దేదీప్యమానంగా దీపాల కాంతిలో వెలిగిపోయింది. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు కొబ్బరి చెట్లు, ఇనుప చట్రాలతో తయారు చేసిన స్టాండ్‌ల్లో 9, 18, 27 ప్రమిదలు అమర్చారు. ఏయూ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ గవరరాజు దంపతులు మొదటి దీపాం వెలిగించి దీపారాధనను ప్రారంభించారు. అనంతరం భక్తులు దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాళ్‌పురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది 31వ దీపారాధన కావడం విశేషం. 1996 నుంచి నిరాటంకంగా దీపారాధన కొనసాగినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు



విశాలాక్షినగర్ ప్రధాన రహదారిపై విరిగిన చెట్లను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



చెట్టు కూలడంతో ధ్వంసమైన విమ్స్ గోడ

ఆరిలోవ: బలమైన ఈదురు గాలులతో గురువారం కురిసిన భారీ వర్షానికి నియోజకవర్గంలో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఆరిలోవ, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, జోడుగుళ్లపాలెం నుంచి తెన్నేటి పార్కు, వీఎంఆర్‌డీఏ పార్కు వరకు బీచ్ రోడ్డులో పలుచోట్ల చెట్లు కుప్పకూలాయి. దీంతో రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తి వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. హనుమంతవాక దరి విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) గోడ చెట్లు కూలడంతో ధ్వంసమైంది. ఆయా చోట్ల విరిగిన చెట్లను జీవీఎంసీ శానిటరీ సిబ్బంది తొలగించి బయటకు తరలించారు. దీంతో ట్రాఫిక్ సమస్య క్లియరైంది. వేకువజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెరిపివ్వకుండా వర్షం కురవడంతో దసరా సందర్భంగా వాహన పూజకు సైతం ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎక్కువ మంది వర్షంలోనే వాహనాలకు పూజలు చేయాల్సి వచ్చింది.

వాల్తేర్ డివిజన్‌లో 'స్వచ్ఛతా అభియాన్'



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద గాంధీజీ విగ్రహానికి డీఆర్‌ఎం లలిత్ బోహ్రా అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 15 వరకు వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించిన రోజు స్వచ్ఛ భారత్–స్వచ్ఛ రైలు సాధ్యమని పేర్కొన్నారు. పలు క్లీనింగ్ పరికరాల పనితీరును డీఆర్‌ఎం స్వయంగా పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంతా సమయ పాలన పాటించాలని, రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో)డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్, స్వతంత్రనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను(యూపీహెచ్‌సీ) సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరోగ్య పథకాలపై అవగాహన ఉండాలన్నారు. వైద్యులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ల హల్‌చల్

తాటిచెట్లపాలెం: నగరంలోని ప్రధాన పోలీస్ స్టేషన్లలో ఒకటైన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో రౌడీ షీటర్ల దాడులు పెరిగాయి. ఇటీవలే పేకాడుతూ చెలరేగిన వివాదంలో ఒక రౌడీషీటర్‌ను కొట్టి, ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్ వరకు ఈడ్చుకెళ్లి పడేసిన ఘటన మరవకముందే, గురువారం సీతంపేట ప్రధాన రహదారిలోని బేకరి వద్ద మళ్లీ రౌడీషీటర్ల ఘర్షణ జరిగింది. రెండు వర్గాల రౌడీషీటర్లు రాడ్లు, చైన్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. నడిరోడ్డుపై జరిగిన ఈ దాడితో స్థానికులు, ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న ద్వారకా పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు, ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాల గురించిన వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింహగిరిపై మెట్ల మార్గం పునరుద్ధరణ



పునరుద్ధరించిన మెట్ల మార్గంలో రాకపోకలు సాగిస్తున్న భక్తులు

సింహాచలం: గత చందనోత్సవం రోజున షాపింగ్ కాంప్లెక్స్ సముదాయంలో గోడ కూలిన ప్రదేశంలో, మెట్ల మార్గాన్ని శుక్రవారం నుంచి తిరిగి పునరుద్ధరించారు. గత ఏప్రిల్ 30న జరిగిన చందనోత్సవం రోజున, నాసిరకంగా నిర్మించిన గోడ కూలడం వల్ల ఏడుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత మెట్ల మార్గాన్ని మూసివేశారు. ప్రసాద్ స్కీమ్ పనులలో భాగంగా గతంలో నిర్మించిన గోడ నాసిరకంగా ఉండటంతో పాటు, మెట్ల మార్గం ప్రణాళికను మార్చడంపై వైదిక వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఈ నెల 2న జరిగిన విజయదశమి జమ్మివేట ఉత్సవం కోసం దేవస్థానం స్వయంగా టెండర్లు పిలిచి, రూ.24 లక్షలతో మెట్ల పనులను పూర్తి చేసింది. గతంలో ఉన్న ప్రణాళిక ప్రకారమే (జోడుభద్రాల ప్రాంగణం నుంచి బస్టాండ్ ప్రాంగణం వరకు) మెట్ల మార్గాన్ని తిరిగి ఏర్పాటు చేశారు.


బీచ్‌లో వ్యర్థాలు కలవకుండా చర్యలు



కాలువల ద్వారా వ్యర్థాలు, మురుగు బీచ్‌లో కలవడాన్ని చూపిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: కాలువల్లో వ్యర్థాలు సముద్రంలో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎమిదవ వార్డు సాగర్‌నగర్ వద్దనున్న సివరేజ్ పంప్‌హౌస్ ప్లాంట్‌ను ప్రధాన ఇంజినీర్ పి.వి.వి.సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలు బీచ్‌లో కలవకుండా చూడాలని దానివల్ల అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కాలువల్లో స్క్రీనింగ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎవరూ కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని సహాయ ఇంజినీర్ శ్రీనివాసరావును ఆదేశించారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్ నరేష్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఏడుకొండలు, సుధాకర్ పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్ర కుమార్,'సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

సేవలకు గుర్తింపు



పైడిరాజును అభినందిస్తున్న కల్నల్ ఎస్ఎస్ షిండే

డాబాగార్డెన్స్: మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ 103 ఏళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్టేషన్‌రోడ్డులో ఉన్న కమాండింగ్ వర్క్స్ ఇంజినీరింగ్(సీడబ్ల్యూఈ–1) శాఖలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను కమాండర్ కల్నల్ ఎస్ఎస్ షిండే అవార్డులందజేసి అభినందించారు. ఎంఈఎస్ సీడబ్ల్యూ–1లో అనేక సంవత్సరాలుగా పనిచేసి పదవీ విరమణ చేసిన తాలాడ పైడిరాజు సేవలను గుర్తించి, తిరిగి రెండేళ్ల కిందట కాంట్రాక్ట్ బేసిస్‌పై విధుల్లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అతన్ని కల్నల్ ఎస్ఎస్ షిండే, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.